ఢిపోవారు, వంకాయలవారు పాములవారు అన్నట్లు బాత్ రూమ్ భాగవతారు అని యొక విద్యార్థి "గిండీ" కాలేజీలో ప్రసిద్ధి చెందిన వ్యక్తి. నడివయస్సు మనిషి - మీసాలుతీసిన అందము, సూటుతీవి, రొమ్మువిరచిన నడక అతనిని పది సంవత్సరములు వెనుకకు నెట్టినవి. అతని యుత్సాహము - ఆసక్తి - యశోవాంఛ పది సంవత్సరములు ముందునకు తన్నినవి.

ముందుచెప్పి పద్యము వెనుకనుండి కూడ పాడేవాడు. అతనికొక భాషతో పనిలేదు. ప్రపంచములో నే భాషయైనను సరే చీమలబారువలె తీరుగా ఒకదాని వెనుక మరియొకటి నడచును. అతని సాధారణ రాగధోరణి 'ఇమిటేషన్ ఆంధ్రారాగము' ఈ పేరతను కనిపెట్టినదే. పంపులోని నీరు అప్పుడప్పుడు ఆగుచుండును. అప్పుడుతీయు రాగము గ్వాలియర్ ఫక్కీ.



# బాత్ రూమ్ భాగవతార్

## శ్రీ గిడ్రాజు రామారావు

భాగవతారునకు సంగీతపు పిచ్చి అత్యధికము. ఎంతపనిలో నున్నను కూనరాగము సాగుచునే యుండును. అతను సంగీతము పాడుకొనుటకు బాత్ రూమ్ కనిపెట్టుకున్నాడు. బాత్ రూము లో చేరినపుడు జంగం కథమొదలు కృతులు వరకు దారాళముగా పైపులోని ధారవలె ప్రవహించ వలసిందే. ధార నెత్తిపై పడునపుడు ఆరాగ మీరాగమని లేదు అన్నియు మిళితములై పోవలసినదే. ఆధారలో పాటలకు మొదలు చివరలతో పనేలేదు. పల్లవి పడిన పిదప పాట తలక్రిందైనను ఫరవాలేదు. ఉద్రేకములో గంగోత్రివలె గగ్గోలుచేయును. భావము

నీరాగినప్పుడు సాధారణముగా రూములలో నుండి గొల్లుమని శబ్దములు రకరకములగు భాషలలో లేచిపోవును కాని మన భాగవతార్ అప్పుడు రెడ్డిగారి "కపాలా" గాని అద్దంకి వారి "రామా" గాని పెరంబూరు ఫ్యాక్టరీ వలె గుక్కపెట్టును. ఈయన సంగీతములో జిలుగు సాఫీ, నునుపు యీ విధముగా వినుచున్న కొలది కైలాసపర్వత మెక్కుచున్నట్లుండును. ఈయనకు ఒక జబ్బుకూడ ఉన్నది. సంగీతము బాత్ రూము దాటితే బందు స్నేహితు లెవరైనా పాడుమనినచో పాపము. చెమటపట్టి జ్వరము వచ్చినంతపని అయ్యేది.

హార్మోనియము ముందరబెట్టినచో గుండెలు నీరై పోవును. ఇతని యుద్రేకమున కింత భయమెందులకు కల్పించినాడో భగవంతుడు.

బాత్ రూములో నలవాటైన సంగీతము తుట్టతుదకు నెత్తిన నీరుపడినగాని సంగీతము రాదు అనగా పాడుకొనవలెననిన తల తడుపుకొనవలెను. దారిలో ప్రమాదవశమున వర్షములో నతడు తడిసినచో సిగ్గు భయములు విడచి రాగము మొలకెత్తును.



ఒకనాడతడు యేమియు దోచక చల్లగాలికి సముద్రపు టొడ్డునకు బోయి ప్రకృతి సౌందర్యము నవలోకించుచుండెను. ఒక్కటేనీరు–ఒక్కటే గాలి అందులకై జన సమూహము వైపు పోవుద మనుకొనెను. ఇంతలో సెంట్లు వాసనలు, చేపల వాసనలో కలిసి భాగవతారుని ఆ ప్రక్కకు త్రిప్పినవి.

కెవ్వుమని గంతువైచి భాగవతారుని చూచి సిగ్గుపడి, ఒకపిల్ల పరిగెత్తుకొని పోయి కొయ్యేలమీద కూర్చుండెను. అతను తెల్లబోయెను కాని వాస్తవముగా నామె సముద్రపు టలలతో నాడుకొనునప్పుడు పీతకాలిపై కెగబ్రాకుటచే కలిగిన ప్రమాదమది నివ్వెరబడి భాగవతారు నిలువబడి పోయెనుకాని వెనుకనుండి పెద్దఅల యొకటి యతనిని సగమువరకు తడిపెను. ఈ దెబ్బలతో వీరిద్దరికి పరిచయమైనది. ప్రకృతియే రాయభారము నడిపింది. ఇక సంబంధము కుదురుటకేమి సందేహము.

భాగవతార్ తడిసెనుగదా రాగము చిగురించెను. కనుచీకటి సమయము. ఒక కొయ్యపై విశ్రమించి ఎందుకైనా మంచిదనుకొని రామనాథశాస్త్రి 'రిసెర్చి' రాగాలాపన మొదలు పెట్టెను. "స్థిరమైన నడినడి జనుల కందరికి వలయు" దాటిపోవుట లేదు. చల్లగాలి వీచిన కొలది వణకు ఎక్కువయ్యెను. సిగరెట్టు వెలిగించి గొంతు సృతిసర్దుకొనెను.

భాగవతారుని కనిపెట్టిన కన్య లలిత. ఆమెకు సంగీతమన్న చాలా ప్రీతి. ఎందుకైనా మంచిదనుకొని వినుచునే యున్నది. భాగవతార్ తనపాట ధోరణిలో ప్రక్కనున్న కన్య సంగతి యంతగా జ్ఞాపకములేదు. పాడి పాడి యావలించెను. అర్థంలేని యావలింపు రాదని దిక్కులు చూచెను. చీకటిలో లలిత కనుపించెను. భాగవతార్ సంగీతము నిలచిపోయెను. ఒడలు కంపించెను. గిండీపోవుసరికి హాస్టలులో భోజనము దొరకదేమో యని యతను లేచి బయలుదేరెను. లలితకూడ కొంతవర కతనిని సాగనంపి తనపనిమీద పోయెను.

'అనగ ననగరాగ మతిశయిల్లుచునుండు' అన్నాడు వేమన కాని సంగీతపాటకులు దానికి రిఫారమ్ తెచ్చిపెట్టినారు. తెల్లవారజామున చన్నీటికుండను కౌగలించుకొని రాగము తీయవలెను. దానికి పైయెత్తు భాగవతార్ కనిపెట్టినాడు. అదే సాధనముగా గైకొని సాధించుచున్నాడు. ఆనాడుప్పుగాలిలో రెండుగంటలు కూర్చుండెను. సాధారణముగా క్రొత్తవిద్యార్థులకు మద్రాసు క్రొత్త వాతావరణమగుటవల్ల జబ్బుచేయును. మన భాగవతారునకు జబ్బుచేయుటలో వింతయేమి? పాపము రెండు నెలలలోనే మంచ మెక్కినాడు.

జ్వరము తీవ్రముగా నుండుటచేత జనరల్ ఆసుపత్రిలో చేరెను. చేరినవెంటనే ప్రక్కనిలుచుండి యుపచారముచేయ మొదలుపెట్టిన స్త్రీ లలితయని యతను తెలిసికొనెను కాని యశక్తుడగుట వలన నేమి చేయగలడు? లలిత ప్రాణములన్నియు నీతనిపై పెట్టుకొని యుపచారము చేయుచుండెను. ఈ యకస్మాత్తు దైవిక సంయోగమున కామె తనలో తాను నవ్వుకొనుచుండెను. జ్వరము త్వరగా తగ్గుటకై యామె మంచుగడ్డ తలకు గట్టెను. ఒక్క రోజులో తగ్గిపోయెను. మరనాటి రాత్రివరకు మంచుగడ్డ వేయుచునే యుండెను. ఆ రాత్రి జ్వరము తగ్గుటవలన గాభోలు, చల్లదనమునకు తనకు తెలియకుండనే రాగము బయలుదేరెను. లలిత కెవ్వుమని దుఃఖము నాపుకొని యతనిప్రక్క గూర్చుండెను. మోహనరా వతని కోరిక నెరవేరిన దనుకొనుచుండెను. అతనికి సంధించినదని లలిత తలంచుచుండెను.

ధైర్యము తెచ్చికొని "ఏమండీ! డాక్టరును పిలువనా" అనెను.

డాక్టరు వచ్చిన రంగము చెడునని అతను పలుకక ఆమెను గట్టిగా కౌగలించుకొనెను. అప్పు డితరరోగులు నిద్రపోవుచుండిరి.

లలితకు ప్రాణభయము పుట్టెను. అతనులేచి తనవెంట పడునేమోయని మంచమునకు కటకటాలు కట్టెను. ధర్మామీటరు నోటిలో బెట్టెను. కాని యతడు దానినితీసి యామెతో నేదియో పల్కుటకు యత్నించెను కాని లలిత రోగికాగితములో 'అపాయము' అని వ్రాసి డాక్టరు దగ్గరకు పారిపోయెను.

భాగవతారునకు గుండెలు కొట్టుకొనుచుండెను. ఒడలు చెమటబట్టెను. తప్పగతి యే

మగునో యని భయముతో గజగజ వణకు చుండెను. ఇంతలో డాక్టరువచ్చి పరీక్ష చేసెను.

అపాయమ'ని యెందులకు వ్రాసితివి అని లలితను ప్రశ్నించెను.

"ఇంతకుముందు వాగుడు మొదలుపెట్టి లేచుటకూడ మొదలు పెట్టెను. అందువలన వ్రాసితిని.

డాక్టరు భాగవతారుని పలుకరించెను కాని యతడు సరిగనే సమాధానములు చెప్పెను.

లలిత తెల్లబోయెను. కాని విషయము పూర్తిగా నర్థము చేసికొనెను ఫరవాలేదని చెప్పి డాక్టరు వెడలిపోయెను.

లలిత:—ఏమండీ! అంత అల్లరి చేసితిరే, మీకు తెలియునా?

భాగవతార్:—ఓసి పిచ్చిదానా? నీ కింత పిరికి పెట్టెనేమో భగవంతుడు – మొన్న బీచిలో కూడ నట్లే గంతువైచితివి. సరే! అర్ధరాత్రి వేళ నేను మాట్లాడకూడదు. రేపు నన్ను వదలి వేయుదురా?

లలిత:—మీ యిష్టము.

మరునాడు భాగవతార్ ఆసుపత్రి విడచి హోటలుకు పోయెను. అచ్చట భోజనము సరిపడ లేదని ప్రత్యేకముగా గదితీసికొని హోటలులో చేరెను. లలిత అప్పుడప్పుడు వాని యింటికి వెళ్లుచుండును సంగీతము నేర్చికొనుటకు కాబోలు!

---



భృంగామలకతైలము

1 ఔన్సు మాదిరి బుడ్డి $2\frac{1}{2}$ అణాలు.

6 ఔన్సు బుడ్డి 12 అణాలు.

నంజగూడు పండ్లపొడి

I.O.L.61. మెడికల్

యునైటెడ్ కన్సర్న్, మదరాసు

౨ అ. 6 ప్యాకెట్టు. తపాలాచార్జీ ఉచితము

హోల్‌సేలు ఏజెంట్లు: యునైటెడ్ కన్సరన్, బందరువీధి, మద్రాసు.

కాకినాడ, సూర్యారావుపేట, లక్ష్మీనారాయణకంపెనీ,

రాజమండ్రి, అరవరామస్వామి అండ్ సన్సు,

బందరు, ఆనందాఫార్మసీయందును దొరుకును.



డాక్టర్. ఎమ్. ఎస్. కిని,

(దంత వైద్యులు)

288, ఎస్‌ప్లనేడ్, మద్రాసు

[కార్పరేషన్ పండ్ల మార్కెట్టు యెదుట.]

ఎట్టి విధమైనపల్లు నొప్పులను పూర్తిగా పరీక్షించబడును. బాధకలుగకుండ పల్లును శుద్ధము చేయుటలోను, పల్లు కట్టుటలోను ప్రఖ్యాతి చెందినవారము. చార్జి చాల తక్కువ. ఒకతూరి పరీక్షచేసిన తెలుసును. ప్రతి దినము వుదయం 9-12 వరకు, సాయంత్రము 3—5-30 వరకును, ఆదివారము వుదయం 9-12 వరకు వైద్యశాల తెఱచియుండును.